క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం



పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నూతన శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయంలో వేకువజాము నుంచి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

19 నుంచి 'మహాభారత యజ్ఞం'

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట కావమ్మ, మారయ్య ఆలయం వద్ద ఈ నెల 19 నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి లక్ష్మిరెడ్డి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని 18 రోజుల పాటు నిర్వహిస్తామని, రోజూ మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

చౌడేపల్లెలో ఎంపీ పర్యటన

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమావేశమవుతారని, అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రాహుకేతు పూజలు



మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా బకాసుర బలి బండి



తవణంపల్లెలో అట్టహాసంగా బకాసుర బలి బండి

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో జరుగుతున్న 119 ఏళ్ల మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సోమవారం బకాసుర బలి బండి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ దేవి, ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవల విగ్రహాలకు అర్చకులు అభిషేకం, పూజలు చేపట్టారు. అనంతరం బకాసురుడికి ఆహారం తీసుకురావడానికి ఏర్పాటు చేసిన బండిని అందంగా తీర్చిదిద్దారు. భీముడు వేషధారి మణి బండి అధిరోహించి తవణంపల్లె, ఎగువతవణంపల్లె, మిట్టపల్లె, గోనేపల్లె, కక్కలమిట్ట తదితర గ్రామాల్లో బండిలో తిరిగి ఆహారాన్ని సేకరించారు.

ఆకట్టుకున్న హరికథా గానం..

మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం భాగవతారిణి స్వర్ణలత బకాసుర వధ గురించి గానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో పాల్గొని హరికథను శ్రద్ధగా విన్నారు. అనంతరం దాతలచే గుడికి విరాళంగా ఇచ్చిన బండిన అందంగా తయారుచేసిన కోదండ ఆచారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



హరికథా గానం చేస్తున్న భాగవతారిణి స్వర్ణలత

ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహించాలి



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. నేను మెడిసిన్ చేయాలనే లక్ష్యంతో కష్టపడి చదివా. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే మాలాంటి పేద పిల్లల పరిస్థితి ఏంటి? గత ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చుచేసి మెడికల్ కళాశాలలను నిర్మించింది. ఇప్పుడు వాటిని ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలా అన్యాయం. ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి. పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలి.

-ఎం.హిందు, నీట్ విద్యార్థిని, రామనపల్లె, బైరెడ్డిపల్లె మండలం



పేదలకూ వైద్య విద్య అందాలి



మెడిసిన్ చేసి ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆశ. దీనికోసమే కష్టపడి చదివా. నీట్ పరీక్షలో 545 మార్కులు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ కోసం ఎదురుచూస్తున్నా. ఇప్పటివరకు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం ఆందోళన కలిగిస్తోంది. పేద విద్యార్థులు ఎంబీబీఎస్ చదవాలనే ఆశలను అడియాశలు చేస్తున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించి పేద విద్యార్థులు చదువుకోవడం ఇక కష్టమే. ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రారంభించి అందరికీ వైద్య విద్య అందేలా చూడాలి.

-నీహారిక, నీట్ విద్యార్థిని, కుప్పం

పంట నమోదుతోనే ప్రయోజనం

- ఈ-క్రాప్ నమోదుకు 23 వరకే గడువు
- నమోదు చేసుకున్న వారికే ప్రభుత్వ ప్రయోజనాలు



పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

సదుం: ఎంతో శ్రమించి పంటల సాగు చేసే రైతుల కోసం పలు పథకాలు అమలులో ఉన్నాయి. ప్రధానంగా వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర, విపత్తుల సమయంలో బీమా సాయం రైతులకు ఉపయుక్తమవుతాయి. ఇందుకోసం ఈ-క్రాప్ సమాచారం తప్పనిసరిగా ఉండాలని వ్యసాయ శాఖ చెబుతోంది. దీనికోసం రైతులు ఈ-క్రాప్, ఈకేవైసీ చేసుకుంటే సరిపోతుంది. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల వద్ద నమోదు చేయించాలని అధికారులు కోరుతున్నారు.

నమోదు విధానం

గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పంట వివరాలను వ్యవసాయ అధికారులకు తెలిపి నమోదు చేయించాలి. పంట సాగు చేసిన భూమి సర్వే నంబరు, విస్తీర్ణం, పంట రకం, పాసు పుస్తకం, ఆధార్, సెల్ ఫోన్ నంబర్ తదితర వివరాలతో నమోదు చేయించాలి. ఈ వివరాలతో భూమి జియో ట్యాగింగ్ అవుతుంది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పొలాల వద్దకు వచ్చి ఫొటోలు తీసి ఈ-క్రాప్ నమోదు చేస్తారు. దీని వివరాలు రైతు సెల్ ఫోన్‌కు పంపుతారు. వీటి ఆధారంగా పంట నష్టపోయినా.. పరిహారం, రాయితీలు పొందేందుకు అవకాశం ఉంటుంది. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు పథకాలకు అర్హత పొందుతారు. అన్నదాత సుఖీభవ, పీయం కిసాన్ యోజన పొందవచ్చు.

గడువు పొడిగింపు

2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదుకు ప్రభుత్వం 23వ తేదీ వరకు గడువు పొడిగించింది. రైతులు ఎక్కువ మంది నమోదు చేసుకునే దిశగా దృష్టి సారిస్తే ఆపత్కాలంలో వీటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది.

ఇప్పటివరకు నమోదైన వివరాలు

మండలంలో 7,803 ఎకరాలలో 3,024 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు.. ఇప్పటి వరకు సుమారు 7,200 ఎకరాలలో ఈ-పంటను నమోదు చేశారు. ఇంకా దాదాపు 600 ఎకరాల పంట వివరాలను నమోదు చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

వందశాతం లక్ష్యాలను పూర్తి చేస్తాం



గడువులోపు ఈ-పంట నమోదు చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటిస్తూ వివరాలను నమోదు చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గడువులోపు వందశాతం లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకున్నాం.

-హరిప్రసాద్, ఏఓ, సదుం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం



లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

బైరెడ్డిపల్లె: బస్సును తప్పించే యత్నంలో అదుపు తప్పి లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి బైరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం మదురై పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ ఆనంద్ ఆళ్లగడ్డ నుంచి మదురైకు సిమెంటు లోడుతో వెళ్తుండగా స్థానిక మెయిన్‌రోడ్డు సెంటర్ బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం ఉదయం దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు లాగి సాయంత్రం వేళకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అప్పటివరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గంజాయి విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. కొండమిట్ట, టాప్‌లైన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టారు. సంతపేటకు చెందిన అక్బర్ (32), చామంతిపురానికి చెందిన రామ్మూర్తి (55) అనే ఇద్దరి వద్ద రెండు ప్యాకెట్లు లభించగా వాటిని తెరచి చూశారు. ఇందులో రెండు కిలోల బరువు ఉన్న గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండుకు ఆదేశించారు. దీంతో వీళ్లను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

భక్తిప్రపత్తులతో 'మిలాద్ ఉన్ నబి'



రాతిమసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

పుంగనూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని స్థానిక రాతిమసీదులో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మసీదు కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధార్మికోపన్యాసం ఇచ్చారు. అంతకు ముందు తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాబా, అంజాద్, యూసుఫ్, అస్లాం మురాధి, ఇర్ఫాన్, సద్దామ్, రిజ్వాన్, బాబుల్లి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

వి.కోట: మిలాద్ ఉన్ నబి పండుగ పురస్కరించుకుని సోమవారం పట్టణానికి చెందిన ఏ-1 చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సయ్యద్ మస్తాన్ అనాథలు, యాచకులు, మతిస్థిమితం లేని వారికి, నిరు పేదలకు అన్నదానం చేశారు. సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జన కోలాహలం



పలమనేరు: డ్రమ్ వాయిస్తున్న మహిళ

పలమనేరు: పట్టణ పరిధిలో పలు వినాయక ప్రతిమలు పదోరోజైన సోమవారం నిమజ్జనానికి తరలాయి. స్థానిక కాకాతోపు, కంసలవీధి, కొత్తపేట, పాతపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను యువకుల కేరింతలు, నృత్యాల మధ్య నిమజ్జనం చేశారు. కంసలవీధిలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భారీ బాణ సంచా మోతతోపాటు కేరళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కుప్పంలో..

కుప్పం: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయ ప్రతిమలను సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. స్థానిక బాబునగర్, ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్, వివిధ వీధుల్లోని ప్రతిమలను పలక వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి వీరప్పనాయన చెరువులో నిమజ్జనం చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: సోమవారం పలు ప్రాంతాలలో గణేష్ నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక తేరువీధిలో వినాయక కమిటీ స్వామివారి ప్రసాదాలకు నిర్వహించిన వేలంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ కన్వీనర్ హేమంత్ రూ.31 వేలకు లడ్డును దక్కించుకున్నారు. అలాగే బెస్తవీధిలోని గజానన సేవా సంఘం లడ్డూను రూ.11 వేలకు పాడారు. రెండు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పలమనేరు: నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య



పుంగనూరు: బెస్తవీధిలో..

ఇక్కడికి ఎమ్మెల్యేగా వస్తా



పుంగనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: నాకు కన్నతల్లి లాంటి పుంగనూరు నియోజకవర్గాన్ని ఎప్పుడు విస్మరించేది లేదని, ఇక్కడికి ఎమ్మెల్యేగా వస్తానని ఎంపీ మిథున్‌రెడ్డి వెల్లడించారు. పుంగనూరు మున్సిపల్ కార్యాలయంలో మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మిథున్ మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా బిల్లు తరువాతనే, నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ముస్లింల అంజుమన్ కమిటీకి ఇచ్చిన హామీ మేరకు కోటి రూపాయలను ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. తమ కుటుంబానికి అనేక పదవులు ఇచ్చి అండగా నిలిచిన పుంగనూరు ప్రజల రుణం తీర్చుకోలేమని తెలిపారు. నియోజకవర్గాల విభజన జరిగినా తాను పుంగనూరుకు ఎమ్మెల్యేగా వస్తానని చెప్పారు. పార్లమెంటు సమావేశాలు పూర్తి కాగానే మున్సిపాలిటీలో వార్డుబాట కార్యక్రమం నిర్వహించి, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. ఈ మాటలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, రాష్ట్ర మాజీ జానపదకళల సంస్థ చైర్మన్ నాగభూషణం, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మాజీ ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప, కౌన్సిలర్లు త్యాగరాజు, అమ్ము, కిజర్‌ఖాన్, రేష్మా, జెపి.యాదవ్, నటరాజ, భారతి పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లును అడ్డుకోవాలి



పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం నేతలు

కేంద్ర ప్రభుత్వం ముస్లిం ఆస్తులకు విఘాతం కలిగించేలా ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డు బిల్లును అమలు కాకుండా చూడాలని ముస్లిం నేతలు ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముస్లిం నాయకులు సలీం, ఫకృద్దీన్ షరీఫ్, ఇబ్రహీం, అమ్ము, జాఫర్, సమివుల్లా, ఖాదర్ కలసి ఎంపీని కలిశారు. ముస్లింలకు అండగా ఉంటామని, ముస్లింలకు వ్యతిరేక చట్టాలను అడ్డుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు.

గంగవరంలో..

గంగవరం: రాజంపేట పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ మాజీ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం తిరుపతి నుంచి పుంగనూరు పర్యటనకు భారీ కాన్వాయ్‌తో వెళ్తున్న ఎంపీకి గంగవరం ఫై ఓవర్ వద్ద పార్టీ నేతలు మొగసాల కృష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్పతో పాటు నియోజకవర్గ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను నాయకులు ఆయనకు వివరించారు. ఆ తరువాత అక్కడి నుంచి పుంగనూరు పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

- అభిమానుల్లో పెల్లుబికిన ఉత్తేజం



పుంగనూరులో ఖాదర్‌ఖాన్ కుటుంబ సభ్యులతో ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: పుంగనూరు పర్యటనకు వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డికి సోమవారం ఘన స్వాగతం లభించింది. పట్టణ నాయకులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఫకృద్దీన్ షరీఫ్, అలీమ్‌బాషా, నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్, అమ్ము ఆధ్వర్యంలో అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎంపీ తొలుత పట్టణంలోని దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ ఖాదర్‌ఖాన్ ఇంటికివెళ్లి ఆయన కుమారుడు అయూబ్‌ఖాన్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మున్సిపాలిటీలో ముస్లిం మైనారిటీలు ఎంపీని గజమాలతో సత్కరించారు. టోల్‌గేట్ నుంచి పట్టణం వరకు ముస్లిం యూత్ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించింది. ఎన్నికల తరువాత జరిగిన పరిణామల నేపథ్యంలో పుంగనూరు పర్యటనకు వచ్చిన ఎంపీ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన వైఎస్సార్‌సీపీ అభిమానులను కట్టడి చేయలేకపోయారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు



తవణంపల్లె: మండలంలో అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎగువమత్యంకు చెందిన ప్రజ్వల్ అనే అతను అధికారుల అనుమతి లేకుండా వంకలోని ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన రీచ్‌ల్లో మాత్రమే ఇసుకను తరలించాలని సూచించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పోటెత్తిన భక్తులు



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రామకుప్పం: మండలకేంద్రానికి సమీపంలోని సుబ్బరాయుని తోపులో ఏడు శిరస్సుల నాగుపాము ఆకారంలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుబ్రమణ్యస్వామి వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. నాగులపుట్టలో పాలు పోసి భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలోని శనీశ్వర స్వామి, నాగుల ముద్దమ్మ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం స్వామివారికి కావడులు చెల్లించారు. వల్లీదేవసమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఊరేగారు. ప్రాకారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ భక్తులకు ఉచిత అన్నప్రసాదాలను పంపిణీ చేసింది.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంతం